# అపోహ

## కొమ్మూరి పద్మావతీదేవి

విశ్వం ఎంత పిలిచినా పలుకవేం రా

"అబ్బ! ఏమిటమ్మా! నీగోల. నాకు పెళ్ళి వద్దమ్మా. కావలసినప్పుడు నేనే నీకు చెపుతాగా.

"బాగుంది వరుస! ఇరువై అయిదేండ్లు నిండాయి. చదువు పూర్తికావాలన్నావు. ఉద్యోగం అయాక అన్నావు. ఇవన్నీ అయినా యింకా వద్దం టే అర్థం ఉండాలి. పోనీ నీ మనస్సులో ఎవరన్నా వుంటే చెప్పు.

"వాళ్లే. ఇదొకటా పైగా! హాయిగా వున్నానమ్మా! నన్నెందుకు సంసారం రొచ్చులో దింపుతావు. నీకూ ఆ కోడలు వచ్చాక తిప్పలు తప్పవు.

"పోరా! నీ వంకలూ నువ్వూనూ! ఇవాళ ఆ వకీలుగారి అమ్మాయిని చూచివద్దాం రా. కబురు చేశారు.

"నువ్వుచూసిరావమ్మా నే నెందుకు?"

"ఇదేమిటీ? నువ్వు చూడకపోతే ఎలా?"

"నేను రానమ్మా! నన్ను ఎన్ని అన్నా అను."

సుందరమ్మ పాపం కొడుకును యిలా అడిగి అడిగి నీరసించడం ఎన్నోసారో? ఏమీ చెయ్యలేక విశ్వాన్ని ఒప్పించలేక మొండిఘటం అని తిట్టుకుంటూ పనిపాటలలో పడింది.

విశ్వానికి పదేండ్లప్పుడే తండ్రి పోయాడు. సుందరమ్మ అష్టకష్టాలూపడి పిల్లవాణ్ణి పెంచి పెద్దచేసి చదువు అదీ చెప్పించింది. ఈనాడు కొడుకు కొన్నివందలు తెస్తున్నాడు. విశ్వాన్ని ఒక యింటివాడిని చేస్తేనేగాని ఆవిడ మనస్సుకు శాంతిలేదు. ఎన్ని విధాలో కొడుక్కు చెప్పిచూసింది. దారి కనుపించలేదు. పోనీ తను ఒక్కర్తే వెళ్ళి పిల్లను చూసి తర్వాత అబ్బాయి వస్తాడంటే, ఏమిటో పాపం ఆలోచనలు తెగటం లేదు. పక్కయింటి సుబ్బయ్య బజారువైపు వెడుతూ :

"ఏరా విశ్వం! ఆవేమ్మది! ఏవన్నా కావాలేమో అడుగూ" అంటూ చుట్టపొగ వదులుతూ విశ్వానికి ఎదురుగా వచ్చి కూర్చున్నాడు.

"అనుకుంటూ వుండగానే వచ్చావు అన్నయ్యా నూరేళ్ళు" అంటూ సుందరమ్మ విశ్వం రానంటున్న సంగతంతా చెప్పి ఎలాగయినా ఒప్పించమని ప్రతిమాలింది.

"అమ్మాయ్! యివి మనరోజులా? ఈకాలం వాళ్ళ యిష్టప్రకారం చేస్తారు. బలవంతంచెయ్యకు. అబ్బాయి పసివాడా ఏం? మంచీచెడ్డా తెలిసినవాడాయె! చెప్పు బజారు పోతున్నా. ఏమన్నా కావాలా?" అంటూ సుబ్బయ్య లేచాడు. రాను రాను తన ఆరోగ్యం సన్నగిల్లుతున్నదనీ, విశ్వాన్ని ఒక ఇంటివాడిని చేస్తేనేగాని నెమ్మదిలేదనీ కన్నీళ్ళతో చెప్పుకున్నది. సుబ్బయ్య ఏం మాట్లాడలేదు. విశ్వం అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు. విశ్వం వెళ్ళినవేపు చెయ్యిచూపిస్తూ సుబ్బయ్య కూడా బయటికి దారితీసాడు.

పనిపాటలు చేస్తూనే ఒక నిశ్చయానికి వచ్చింది సుందరమ్మ. తనేవెళ్ళి పిల్లనుచూసి నచ్చితే ఏర్పాటు చెయ్యాలని.

నెయ్యి వడ్డిస్తూ పరధ్యాన్నంగావున్న విశ్వాన్ని చూసి.

"విశ్వం! పిల్ల చాలా బాగున్నది. చదువుకున్నది. నువ్వు వాళ్ళకు బాగా తెలుసుట! నువ్వు గనుక వూఁ అంటే లగ్నాలు చూస్తారుట.

... ... ... ... ... "

"విన్నావా"

"వూఁ ... ... .."

"వుఁ కాదు ఆ కాదు. ముసిలిదాన్ని అయ్యాను కనుక ఏడిపించకు. జాతకాలు చూసి లగ్నం పెట్టమని చెప్పేస్తున్నారా" అన్నది లేచివెళుతూన్న కొడుకును చూసి.

"నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి" అంటూ విశ్వం ఇన్ని మంచినీళ్ళు త్రాగి తొందరగా వెళ్ళిపోయాడు. అలాగే కూర్చుండిపోయి గంటలకొద్దీ ఆలోచించింది సుందరమ్మ.

"అమ్మాయ్! లగ్నం వరకు వచ్చిందిటగా?" అంటూ సుబ్బయ్య పొగాకుకాడలు చేత్తో పట్టుకుని తొందరగా వచ్చాడు.

పిల్లవాడు వూఁ అన్నప్పుడే చేసెయ్యాలనీ శుభస్య శీఘ్రం అనీ సలహాయిచ్చాడు. సుందరమ్మ ఆనందం చెప్పతరం కాదు. పని ఏమీ సాగలేదు. అందరికీ చెప్పింది. ఒకవారంలో విశ్వానికి పెళ్ళి నిశ్చయం అయి లగ్నపత్రికలు అచ్చుకు వెళ్ళాయి.

పెళ్ళికూతురు ఎంత ఉత్సాహంగా వుందో విశ్వం అంత మందమతిగా వున్నాడు. ఆ పెళ్ళి మండపంలో. లీల లీల అంటూ స్నేహితులంతా చేరారు. ఒకటే నవ్వులు; ఒకటే కబుర్లగోల! పెళ్ళిపందిరి ఎగిరిపోయేటంత అల్లరీ ఆగమూ చేస్తున్నారు. విశ్వం సిగ్గుతో తలవంచుకుని ఎవరినీ చూడకుండా అదోలా వున్నాడు. తల్లీ, పురోహితుడూ చెప్పిన వన్నీచేస్తూ లీలమెళ్ళో పుస్తె కట్టాడు. ఆ పసుపుతాడు, ఆ మంత్రాలు అవన్నీచూసి లీల కొంటెగా నవ్వుతూంది.

కోడలంటే యిలాగే వుండాలనీ ఇంత చలాకీ పిల్ల తనకి కోడలుగా రావాలని అనుకున్నాను అని సుందరమ్మ తనవాళ్ళతో చెప్పి మురిసిపోయింది.

పిల్లతరుపువారికి చాదస్తాలు అసలు పనికిరాకపోయినా తప్పనిసరిగా కొన్నివప్పుకున్నారు. పెద్దల పాదాలకు నమస్కరించటం నాన్సెన్స్ అన్నది పెండ్లికూతురు. అంతా నవ్వారు. సుందరమ్మ పాపం ముఖం యింత చేసుకుంది. విశ్వం ఏం పలుకలేదు.

"మాటలు రావా? మూగతన్ని చేసుకున్నావా?" అని లీల స్నేహితులు నవ్వులతో మాటలు విసిరారు. విశ్వం వాళ్ళను తలెత్తికూడా చూడలేదు.

విశ్వానికి పెళ్ళయి ఆరునెలలు దాటింది. కోడలు యింటికి రాలేదు. ఈ పెద్దపండుగకు కోడలును తీసుకురావాలనీ గొబ్బెమ్మలు పెట్టించి నలుగురినీ పిలిచి పేరంటం చేయించాలనీ సుందరమ్మ ఉబలాటపడి కబురుచేసింది. కోడలు రాలేదు. గుమ్మానికి పసుపురంగులు పూయించి, ఎర్ర రంగుతో ముగ్గులు పెట్టించి, బంతిపూల తోరణాలు కట్టించి, ఇల్లంతా చక్కగా అలంకారం చేయించింది. గుమ్మం పక్క ఏ బండివెళ్ళినా తలెత్తి గంపెడు ఆశతో అటు చూస్తూంది.

"అమ్మా! ఇంత చాదస్తం ఏమిటమ్మా లీల రాదు."

"రాని కబురు పంపిందా?"

"పంపాలా? పండక్కు నన్ను రమ్మన్నారు. నే రానన్నాను. అదీగాక ఈ యిల్లూ ఇదీ అంతా ఉత్త పల్లెటూరు చాదస్తం అని లీలకి నమ్మకం. రాదు."

"ఆదేమిటిరా అబ్బాయ్! తెలిసే చేసుకుందిగా మరి! అడుగలేకపోయావా?"


"రాకపోతే పోనీగాని నేను అడగను. కావలిస్తే నువ్వువెళ్ళి అడుగు."

"ప్రతివిషయంలో యింత పట్టుదల పనికిరాదురా! వెళ్ళి పిలుచుకురా."

నా ఖర్మం కాలింది వెళ్ళడానికి. నేనేం వెళ్ళను. ఇంక వాళ్ళసంగతి నాదగ్గర ఎత్తకు."

"ఇంతగా అన్నీ చేయించాను. నా తండ్రివి కదా! వెళ్ళి పిచుకురా"

విశ్వం వెళ్ళననీ, తల్లి వెళ్ళమనీ గొడవపడుతూండగా గుమ్మంలో బండి ఆగింది. సూటుకేసు చేత్తో పట్టుకుని కోడలు దిగింది. కోడలు గుమ్మంలో అడుగుపెట్టగానే ఇరుగు పొరుగు అంతా వింతగా యిల్లంతా మూగారు. సుందరమ్మ కోడలిని చూసి నిర్ఘాంతపోయింది. బుజాలమీదికి జుట్టు కత్తిరింపు, పెదిమలకురంగు, మెళ్ళో చేతులకీ ఏం లేకుండా, ఎత్తుమడమలజోడుతో, చేతిలో పెద్ద ఫర్సుతో దిగింది. నోట మాటరాక అలానే



మచ్చలేని జంట ! ఆర్. ఉదయభాస్కర్ !

నిలబడింది సుందరమ్మ. విశ్వం ఆ గుంపుని చూసి కోపలికి చక్కా పోయాడు.

''చదువుకున్న కోడలు దొరసానిలా వుంది'' అంటూ అందరూ గుసగుసలాడుతున్నారు.

''ఏమిటే? ఈ జనం. నే నేం జంతువునని అనుకున్నారా? అలా చూస్తారేం?'' అంటూ కోపంగా అరిచింది లీల.

సుందరమ్మ మాట్లాడకుండా కోడలినే చూస్తోంది. మెళ్లో నల్లపూసలన్నా లేకుండా ఉత్త మెడ; ఒక్క గాజన్నాలేని ఆ బోసిచేతులు, కోడలివేషం ఆమెకు చాలా నీరసం తెప్పించింది. ఒక్క మాటకూడా రాకుండా గొంతు అదోలా అయింది. ఒకళ్ళ తరువాత ఒకళ్ళు ఆ గుంపు రావడం. వింతగా చూడటం మనసుకి మరింత బాధ కలిగించింది. లీల తిన్నగా విశ్వం గదిలోకి వెళ్ళింది. ఏం మాట్లాడుకున్నారో భార్యాభర్తలు? నవ్వులూ మాటలూ సుందరమ్మకు వినిపించాయి. కాస్త ప్రపంచంలో పడింది. పురోహితుడి భార్య వచ్చి.

''ఏమండీ! నలుగుర్నీ నేనే వెళ్ళి పిలిచిరానా! కోడలువస్తుందా పిలుపుకి? పళ్ళుకూడా పంచుతామన్నారు.'' అంటూసుందరమ్మని ఇంటిప్రపంచంలోకి దింపింది. ఇంతలో లీల లోపలినుంచి వచ్చి అత్తగారి ప్రక్కన నిలబడి:

''నే వెళ్ళి పిలుస్తా అత్తయ్యా. ఓ గంట పోయాక ఆవిడని రమ్మనండి'' అంటూ చేతి గోళ్ళరంగు చూసుకుంటూ మధ్యన అత్తగారిని చూస్తూ అడిగింది.

''నువ్వు ఎందుకులే! ఆవిడవెళ్ళి పిలిచివస్తుంది అన్నది సుందరమ్మ తడబడుతూ.

పురోహితుడిభార్య లీలని వింతగా చూస్తూ ''నేనే పిలుస్తా లెండి'' అంటూ అటు గుమ్మం దాకా వెళ్ళింది.

''అత్తయ్యా! మీరెందుకు వద్దంటున్నారో నాకు తెలుసు. మీరు నేను ఎలా వుండాలని వుందో అలా అలంకారం చెయ్యండి. సవరం పెట్టి జడవేస్తే సరి.'' అంటూ అత్తగారి చేతులు పట్టుకుని కిలకిలా నవ్వింది. లీల నవ్వులో బంతిపూలదండలు వూగాయి. గుమ్మాల పసుపు మెరిసింది. వేసిన ముగ్గులు అన్నీ ఒక్కసారి కళకళలాడుతూ కళ్ళకి కొట్టవచ్చినట్లుగా కాంతిని విరజిమ్మాయి. సుందరమ్మ లీలనుచూసి ఆ మాటలు విని తనూ నవ్వింది.

సాయంత్రం అయ్యేసరికి ఇల్లంతా పిల్లలతో పెద్దలతో పేరంటాల ముత్తయిదులు నిండిపోయారు. సుందరమ్మ కోడలిని చూడాలని ఆ చుట్టుప్రక్కల అంతా విరగబడి వచ్చేశారు. వాలుజడకు వ్రేలాడుతున్న కుచ్చులతో చెవులకు జూకాలు; చేతులకు రంగురంగుల గాజులు; నడుంకి వడ్డాణమూ; మెళ్ళో కాసులపేరు తల నిండా చామంతిపూలు; తల్లో రాళ్ళరాగిడి, చెవులకు చెంపసరాలు; ఇవన్నీ పెట్టుకుని లీల సంక్రాంతి లక్ష్మిలా, సావిత్రి గౌరీదేవిలా అందరికీ పసుపూ కుంకుమ అందిస్తూ పళ్ళుపంచి పాదాలకు నమస్కరించింది. పెద్దలు దీవిస్తూ అక్షింతలు చల్లారు. గొబ్బెమ్మకు హారతిపాట కోడలు పాడుతూంటే అంతా అటు చూశారు. సుందరమ్మకి ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లాయి. వచ్చిన వాళ్ళు ఆశ్చర్యంతో తెల్లపోయారు. అందరు పేరంటాళ్ళు అలా వెళ్ళగానే!

''శీలా! ఇలా రామ్మా దిష్టి తీస్తాను'' అంటూ సుందరమ్మ కోడలిని పిలిచింది.

''ఉండమ్మా వేషం తీసేస్తుంది'' అంటూ విశ్వం నవ్వుతూ తల్లిముందు నిలబడ్డాడు.

''అత్తయ్యా! మీ పాదాలకు నమస్కరించనే లేదు. అయ్యో నా మతిమరుపు మండ'' అంటూ లీల అత్తగారి పాదాలను తాకింది. జడలేకుండా అన్నినగలతో బుజాలమీద జుత్తునితీసుకుంటూ వంగిన కోడలునుచూసి సుందరమ్మకు నవ్వు ఆగలేదు.

విశ్వం తల్లితో కలిసి తనూ నవ్వాడు. లీల సిగ్గుపడుతూ లోపలకు వెళ్ళింది.

''భగవంతుడా! మన మనస్సుల్లో ఎలాంటి అనుమానాలూ అపోహలూ వస్తాయో నే చేసుకున్న పుణ్యంకొద్దీ దొరికింది ఈ కోడలు. లేనిపోనివన్నీ అన్నాను'' అంటూ ఎర్రనీళ్ళు వీధి గుమ్మాన పొయ్యడానికి అటుతల్లివెళ్ళగానే విశ్వం నవ్వుతూ ఉయ్యాలబల్లమీద పూలరాసిపక్కనే కూర్చున్నాడు.

నవ్వాడుకాకుండా లీల అతని వెనకాలే వచ్చి బంతిపూలరేకులన్నీ తలమీదచల్లి అటు వస్తున్న అత్తగారిని చూసి కాస్త సిగ్గుపడింది.

కొడుకునీ కోడలునూ చూసుకుని మురిసిపోతూ ఆ ఆనందం అదీ తలుచుకుని పారవశ్యంతో తలవంచుకుని చిన్నతనపు తన రోజులు అవి తలుచుకుంటూ లోపలికి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

దంపతులిద్దరూ బంతిపూల రేకులు ఒకరిమీద ఒకరు బుక్కాయిలు చల్లినట్లుగా చల్లుతూ విసురుతూ, వుయ్యాలబల్లచుట్టూ పరుగెత్తడం చూసి లోపలికి రాబోతున్న పురోహితునిభార్య చటుక్కున వెనక్కుతిరిగి వెళ్ళిపోయింది నవ్వుకుంటూ.

